

7న మహిళా దినోత్సవ సదస్సు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల ఏడో తేదిన ఉదయం 10 గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారీ, ఎస్‌పి రాధిక, జిల్లా స్థాయి మహిళా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సదస్సుకు ఐసిడిఎస్ సిబ్బంది, మహిళలందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

లావేరు మండలం కొత్తకొంకాం వద్ద తవ్వి వదిలేసిన కాలువ



మడ్డువలస రెండో దశ పనులు అర్ధాంతరంగా ఆగాయి. నిర్మాణ పనులు చేపడుతున్న సంస్థకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే ప్రధాన కారణమన్న చర్చ అధికార వర్గాల్లో నడుస్తోంది. మరోవైపు కాలువ తవ్వకాలకు అధికారులు భూమిని సేకరించినా రైతులకు డబ్బులు ఇవ్వకపోవడమూ పనులు ఆగిపోవడానికి దారితీసింది. దీంతో పాటు పొందూరు మండలంలోని పలు ప్రాంతాల్లో బండరాళ్ల తొలగింపునకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో కాలువ తవ్వకాలు నిలిచిపోయాయి. ఒప్పందం ప్రకారం ఈ పనులు ఈ ఏడాది జనవరి 31 నాటికి పూర్తి కావాల్సి ఉంది. అధికారులు పలుమార్లు నోటీసులు ఇస్తున్నా కాంట్రాక్టర్ స్పందించడం లేదని తెలుస్తోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఒప్పందాన్ని రద్దు చేయాలని అధికారులు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోనుందో వేచి చూడాల్సి ఉంది.

అర్ధాంతరంగా ఆగిన మడ్డువలస

- కాలువ తవ్వకాలకు అనుమతివ్వని గనులశాఖ
- నిర్మాణ సంస్థకు రూ.1.80 కోట్ల బిల్లుల పెండింగ్
- ఒప్పందం ప్రకారం జనవరితో ముగిసిన గడువు
- అధికారుల నోటీసులకూ స్పందించని కాంట్రాక్టర్

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని చేపట్టాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతోపాటు మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పథకం నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పిజెఆర్ కనస్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.39 కోట్లకు దక్కించుకుంది. మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాలి. అంటే, మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగు నీరందించాలి. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశమిచ్చింది. చివరి సారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో రూ.37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జూలై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది

జనవరితో ముగిసిన గడువు

రిజర్వాయర్ పనులు చేపట్టిన పిజెఆర్ కనస్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు పనులు పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లు మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25న ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎస్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కనస్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది జనవరితో గడువు ముగిసింది

పనులు జరిగింది ఐదు శాతమే

మడ్డువలస రెండో దశ పూర్తి కావాలంటే మిగిలిన 21.64శాతం పనులు పూర్తి చేయాలి. ఇప్పటివరకు ఇందులో ఐదు శాతమే పూర్తయినట్లు తెలిసింది. పొందూరు మండలం విఆర్ గూడెం, ధర్మపురం, వావిలపల్లిపేట ప్రాంతాల్లో కాలువ తవ్వకాలకు బండరాళ్లు అడ్డురావడంతో వాటిని పేల్చి తొలగించాల్సి ఉంది. గనులశాఖకు దరఖాస్తు చేసినా అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు రైతుల నుంచి తీసుకున్న భూములకు రూ.2.25 కోట్లను చెల్లించకపోవడంతో కాలువ తవ్వకాలూ ఆగిపోయాయి

ఒప్పందం రద్దుపై అధికారుల లేఖ

పనులు చేపడుతున్న నిర్మాణ సంస్థకు సుమారు రూ.1.80 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ పెద్దగా ఆసక్తిచూపడం లేదని సమాచారం. బిల్లులు వస్తాయో లేదోనన్న సందేహంతో వెనకడుగు వేస్తుండటంతో పనులు ముందుకు సాగడం లేదు. పది కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉండగా నాలుగు కిలోమీటర్ల మేర తవ్వారు. కాలువపై 250 స్ట్రక్చర్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు ఒక్కటీ నిర్మించలేదు. పనులు ముందుకు సాగకపోవడంపై అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చినా కాంట్రాక్టర్ స్పందించడం లేదని తెలుస్తోంది. దీంతో ఒప్పందాన్ని రద్దు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోనుందో వేచి చూడాల్సి ఉంది.

సామాజిక ప్రగతి దిశగా ఎపి

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

ప్రజాశక్తి-ఎచ్చెర్ల



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన ప్రగతి సాధించిందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు సామాజికాభివృద్ధికి ఊతమిచ్చాయన్నారు. ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో 'సుపరిపాలనా దిశగా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై జరిగిన ప్రత్యేక సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల్లో సామాజిక, ఆర్థిక స్వావలంబన వచ్చినప్పుడే నిజమైన ప్రగతికి నిదర్శనమన్నారు. ఆ దిశగా అడుగులు వేయడంలో భాగంగానే ప్రభుత్వ వైద్యకళాశాలల ఏర్పాటు, యువతకు ఉపాధి అందించే పారిశ్రామిక ఒప్పందాలు, రైతులకు ఉపయోగ పడే చట్టాలు వంటి సాహసోపేత విధానాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. యూనివర్సిటీ విసి కె.ఆర్. రజిని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి.శాంతమూర్తి, రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, ప్రొఫెసర్ వి.వెంకట్రావు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అజేయ కల్లం సమాధానమిచ్చారు.

వైజ్ఞానిక సాంకేతిక ప్రదర్శన ప్రారంభం

డాక్టర్ బిఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే వైజ్ఞానిక సాంకేతిక ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. యూనివర్సిటీ సెమినార్ హాల్లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజిని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, ఆశావహ దృక్పథం వంటి అంశాలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే కెరీర్ మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పల్సస్ సిఇఒ జి.శ్రీనుబాబు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో పుష్కలమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞ కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిజిస్టర్ బి.అడ్డయ్య పాల్గొన్నారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షకు 635 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఇంటర్ ద్వితీయ సంవత్సర ఇంగ్లీష్ పరీక్ష మంగళవారం జరిగింది. జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ తలెత్తకుండా పరీక్ష నిర్వహించారు. 83 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 19,731 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 19,096 మంది హాజరయ్యారు. 635 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ గ్రూపు విద్యార్థులు 18,546 మందికి 17,954 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1185 మంది హాజరు కావాల్సి ఉండగా 1142 మంది రాశారు. ద్వితీయ ఇంటర్ ఇంగ్లీషు పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి (ఆర్ఐఒ) ప్రగడ దుర్గారావు తెలిపారు.

ఆమదాలవలస కమిషనర్‌గా రవి

ప్రజాశక్తి - ఆమదాలవలస



ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా జి.రవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఎం.రవి సుధాకర్ అమరావతికి బదిలీపై వెళ్లారు. అనంతరం స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవికి సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ అజయ్ కుమార్

హామీలు అమలు చేయాల్సిందే

జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్

ప్రజాశక్తి-పలాస

జీడి పంటకు మద్దతు ధర, పిక్కలను ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుపై సిఎంఒ అధికారులతో జరిగిన చర్చల్లో హామీలు తక్షణమే అమలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాశీబుగ్గ అమ్మ ఆశ్రమం వద్ద వామపక్ష నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటో తేదీన మంత్రి సీదిరి అప్పలరాజు, సిఎంఒ ధనుంజయరెడ్డితో జీడిపంటపై చర్చలు జరగాయని, అందులో ఇచ్చిన హామీలను నెల రోజులు కావస్తున్నా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పంటను పంటల జాబితాలో చేర్చి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుకు హామీ ఇచ్చారన్నారు.


ఉద్యాన శాఖాధికారులు, కమిషనరుతో కలిసి స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు మద్దతు ధర నిర్ణయించేందుకు హామీ ఇచ్చారన్నారు. వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనారి మోహనరావు, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, రైతు సంఘం నాయకులు కొర్ల హేమారావు చౌదరి, కోనేరు గురయ్య, ఎం.జోగారావు, కుత్తుం ఢిల్లీరావు, వంకల అప్పయ్య, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికం

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి-పొందూరు

రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. పొందూరు మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. మండలంలోని గోరింటలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, తాడివలస రోడ్డు నుంచి పైడిజోగిపేట వరకు రూ.41 లక్షలతో నిర్మించిన బిటి రహదారి, గోకర్ణపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించిన సిసి రహదారిని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మత, ప్రాంతీయ భేదాలకు తావులేకుండా అవినీతి రహితంగా సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, గోకర్ణపల్లి సర్పంచ్ చింతాడ మాధురి, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి బాడాన వెంకటకృష్ణారావు, వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు పైడి రాణాప్రతాప్, నాయకులు చింతాడ సత్యప్రసాద్, కిల్లి నాగేశ్వరరావు, కూన గోపాలం, బొడ్డేపల్లి రమణారావు పాల్గొన్నారు.



రహదారిని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆర్అండ్‌బి అధికారుల తీరుపై స్పీకర్ ఆగ్రహం

స్థానిక ప్రజాప్రతినిధులకు, నాయకులకు సమాచారం ఇవ్వకుండా రహదారి ప్రారంభోత్సవానికి ఆర్అండ్‌బి అధికారులు ఏర్పాట్లు చేయడంపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు మండలంలోని రాపాక పంచాయతీ వావిలపల్లిపేట కూడలి నుంచి వి.ఆర్.గూడెం, వయా ధర్మపురం మీదుగా తోలాపి వరకూ నూతనంగా నిర్మించిన రహదారిని స్పీకర్ తమ్మినేని సీతారాం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి మంగళవారం ఆర్అండ్‌బి అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు రూ.6.15 కోట్లతో దాదాపు 8 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టిన రహదారిని ప్రారంభించేందుకు స్పీకర్ వచ్చారు. కాని అక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కనిపించకపోవడంతో ఆర్అండ్‌బి జెఇ ఆంజనేయ నాయక్, కాంట్రాక్టరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి ప్రారంభోత్సవం చేపట్టేటప్పుడు స్థానికంగా ఉన్న వైస్ ఎంపిపి, సర్పంచులు, ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వాలి కదా?, ఎందుకు చెప్పలేదంటూ ప్రశ్నించారు. ఇలాగేనా రహదారుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసేదంటూ, ప్రారంభానికి నిరాకరిస్తూ వెనక్కి వెళ్లిపోయారు. ఆయన వెంట వైసిపి నాయకులు గుడ్ల మోహనరావు, పకీరు, కోట నాగరాజు, వండాన సూరపనాయుడు, గోవిందరావు, తదితరులు ఉన్నారు.

కంటి తుడుపు చర్యలే

మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మంత్రి ధర్మాన ప్రసాదరావు సభా వేదికలపై అంతా తానే అభివృద్ధి చేశానని చెప్పుకుంటూ, తనకే ఓట్లు వేసి తిరిగి గెలిపించాలని కోరడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ వ్యాఖ్యానించారు. ఇంత అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్న మంత్రి.. శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు, కోడి రామ్మూర్తి స్టేడియం , నర్సింగ్ కళాశాల , వంశధార స్టేట్ హైవేను ఎందుకు పూర్తి చేయలేక పోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్మాన అభివృద్ధి అంతా కంటితుడుపు చర్యలేనని అభిప్రాయపడ్డారు. మంగళవారం అరసవల్లిలోని తన స్వగృహంలో మీడియాతో ఆయన మాట్లాడారు. గతంలో తన భార్య లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అర్థాంతరంగా సగం నిర్మించి వదిలేసిన పాత వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయలేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధిని అడ్డుకోవడం, ఎన్నికల ముందు తానేదో గొప్పగా చేశానని ప్రజలను నమ్మించేందుకు మసి పూసి మారేడు కాయ చేయడం ధర్మానకు అలవాటని ధ్వజమెత్తారు. కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణంలో జాప్యం జరిగిందని గత ఎన్నికల ముందు ధర్నాలు చేసిన ధర్మాన.. గత ఐదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేక పోయారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వంశధార నదిపై వంతెన పనులు సగానికి పైగా పూర్తయినా ఎందుకు నిర్మించలేక పోయారని నిలదీశారు. రైతులను పూర్తిగా విస్మరించి తన సొంత వ్యాపారాలపైనే దృష్టి కేంద్రీకరించిన ఆయన ఎన్నికల ముందు గ్రామాల్లో చివరి అవకాశమని చెపుతున్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న సమయంలో కోడి రామ్మూర్తి స్టేడియానికి నిధులు వచ్చాయని ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి ప్రచారాన్ని ప్రజలు విశ్వసించరని చెప్పారు.

ఎపిటిఎఫ్ ధర్నా వాయిదా

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలోని ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యలను పరిష్కరించడానికి జెడ్‌పి డిప్యూటీ సిఇఒ వెంకటరామన్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో బుధవారం చేపట్టే ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్ మోహన్ తెలిపారు. మంగళవారం జెడ్‌పి కార్యాలయంలో జరిగిన చర్చలు సఫలమైనట్లు ఆయన తెలిపారు. పిఎఫ్ సిప్పులు ఆన్‌లైన్‌లో రాని కారణంగా మాన్యువల్‌గా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. పార్ట్ ఫైనల్ దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లో సిఎఫ్ఎంఎస్‌కు పంపించాలని, మరణించిన ఉపాధ్యాయులకు బూస్టర్ స్కీమ్ పునరుద్ధరించాలని తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. వ్యక్తిగత, ఉమ్మడి సమస్యలపైనా చర్చించారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వి అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, బి.ఢిల్లేశ్వరరావు, బి.నేతాజీ, కార్యదర్శులు చావలి శ్రీనివాస్ డి.రామ్మోహన్, వి.నవీన్ కుమార్, పి.తిరుమలరావు, రాష్ట్ర కౌన్సిలర్లు బి.చంద్రశేఖర్, బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి-ఇచ్ఛాపురం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మంగళవారం మండలంలో మండపల్లి, బాలకృష్ణాపురం పంచాయతీల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. మండపల్లి పంచాయతీలో రూ.8 లక్షలు జిల్లా పరిషత్ నిధులతో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండపల్లి పంచాయతీ బుడ్డేపుపేట గ్రామంలో రూ.5 లక్షలు జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బాలకృష్ణపురం గ్రామంలో మహిళా సంఘాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మళ్లీ పొందాలంటే వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మండపల్లి సర్పంచ్ పిట్ట శేషమ్మ మామయ్య, కారంగి మోహన్‌రావు, సల్ల దేవరాజ్, దక్కత నోకయ్య రెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి, బుడ్డ కళ్యాణ్, సాలిన ఢిల్లీరావు, మోహన్ దాస్ పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన డిఐజి

ప్రజాశక్తి- జలుమూరు

ఈ నెల 8 నుంచి 11 వరకు శ్రీముఖలింగంలో జరిగే మహాశివరాత్రి, చక్రతీర్థ స్నానాల సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని.. ఎస్‌పి జి.ఆర్.రాధికతో కలిసి మంగళవారం పరిశీలించారు. శివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే యాత్రికుల క్యూలైన్ల ఏర్పాట్లు, చక్రతీర్థ స్నానాలు రోజున నది వద్ద ఏర్పాట్లు, బారికేడ్లు, రూట్ మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. చక్రతీర్థ స్నానాలకు వచ్చే ప్రజలకు ఆటంకాలు లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని, ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఐ బి.ప్రసాదరావు పాల్గొన్నారు.



బందోబస్తు ఏర్పాట్లపై చర్చిస్తున్న డిఐజి విశాల్ గున్ని

ఉపాధి కల్పనలో నిర్లక్ష్యం వద్దు

డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి-పోలాకి



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

మండలంలో వేతనదారులకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు హెచ్చరించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాదిలో వేతనదారుల సంఖ్య తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కోస్తా గ్రామంలో అటవీశాఖతో సమన్వయం చేసి, ఆ ప్రాంతాల వారికి కూడా పనులు కల్పించాలని సూచించారు. జాబ్ కార్డుదారులందరికీ 100 రోజులు పనులు కల్పించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందువల్ల పనివేళలు మార్పు చేయాలని, పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి మురళీకృష్ణ, ఎపిఒ రమణ, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన టిఒటి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఎన్ఆర్‌సి పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న బోటనీ, మైక్రో బయాలజీ అధ్యాపకులకు నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఓరియంటేషన్ (టిఒటి) ప్రోగ్రాం మంగళవారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపల్ పి.సురేఖ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం వల్ల విద్యారంగంలో వస్తున్న మార్పులను అధ్యాపకులు అన్వయించుకుని మెరుగైన విద్యను అందించాలన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్టుల పట్ల మరింత శ్రద్ధ కనబరచాలన్నారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా ఎస్.రుద్రమరాణి, యు.ఫణికుమారి వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఆర్‌సి కోఆర్డినేటర్ బర్రి మోహన్ రావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ హరిత హాజరయ్యారు.

ర్యాంకుల మాయాజాలంలో కార్పొరేట్ విద్య

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు , విద్యార్థుల తల్లిదండ్రులు

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు మొదలవుతుంటే, అంతకు ముందే కార్పొరేట్ కళాశాలలు అడ్మిషన్ల కోసం ర్యాంకుల మాయాజాలం చూపిస్తూ తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ తెలిపారు. దీనివల్ల యువత యాంత్రిక జీవన శైలికి అలవాటు పడి నాలుగు గోడల మధ్య కుస్తీ పడుతూ ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం గార మండలం ఉప్పరపేట గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, కార్పొరేట్ విద్య వల్ల జరుగుతున్న అనర్థాలను ప్రచారం చేశారు. కార్పొరేట్ కళాశాలల్లో చేరడం వల్ల అద్భుతాలు జరగవని, వేల మంది విద్యార్థులు ఆ సంస్థల్లో చేరి పెద్దఎత్తున ఆర్థికంగా నష్ట పోతున్నారని తెలపారు. ర్యాంకుల పట్ల ఆసక్తి పెంచుకుని ఒత్తిడి మధ్య నలిగి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్పొరేటు విద్యాసంస్థల్లో చేరిన వారందరికీ ర్యాంకులు రావని, పరిమిత సంఖ్యలో మాత్రమే వస్తున్నాయని గుర్తు చేశారు. ఒత్తిడి వల్ల అనేక మంది విద్యార్థులు కార్పొరేటు విద్యాసంస్థల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారని, నిపుణులైన అధ్యాపకులు, ఒత్తిడి లేని చదువులు అందుతున్నాయని తెలిపారు. యాంత్రిక జీవనం వైపు పరుగులు తీయొద్దని విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు వారు కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి సంతోష్, కమిటీ సభ్యులు భూపతి, మహేష్, లక్ష్మీనారాయణ, సాయి, దిలీప్, సూర్య తదితరులు పాల్గొన్నారు.


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

సాగు భూములకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

మండలం తెప్పలవలస పంచాయతీ సీతారాంపురం రెవెన్యూకు సంబంధించి రావాడ పంచాయతీ లంకపేట గ్రామానికి చెందిన పేద కుటుంబాలు సాగుచేసుకుంటున్న భూముల లబ్ధిదారులకు పట్టాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములను సాగుచేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో రణస్థలం పిఎసిఎస్ చైర్మన్ కిల్లారి రమణ, తెప్పలవలస పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బొమ్మలాట శ్రీరాములు, రావాడ పంచాయతీ ఎంపిటిసి ప్రతినిధి కిల్లారి సూర్యనారాయణ, వైసిపి నాయకులు కొయ్యి సోమలు రెడ్డి, లంక పాపారావు, కిల్లారి సన్యాసినాయుడు, ఆసిరినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

భారత ప్రజాస్వామ్యం భేష్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రజాస్వామ్యం అమలవుతున్న ప్రపంచ దేశాలన్నింటిలో భారత్‌లో అమలవుతున్న ప్రజాస్వామ్యం భేషుగ్గా ఉందని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే జిల్లాస్థాయి మాక్ యూత్ పార్లమెంట్ సమావేశ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో సాతంత్ర్యం వచ్చిన ఎన్నోఏళ్ళకు గాని మహిళలకు ఓటుహక్కు కల్పించలేదని, మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మహిళలకు ఓటుహక్కు కల్పించారన్నారు. నేడు మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు విద్య, వైద్యం, సాంకేతికత, నెట్వర్కింగ్ వంటి సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. నేరస్తులు రాజకీయాల్లోకి రాకుండా చూడాల్సిన భాధ్యత ప్రజలందరిపైనా ఉందని, ప్రతిఒక్కరూ ఆలోచించి విధిగా ఓటు వేయాలన్నారు. నెహ్రూయువ కేంద్రం జిల్లా అధికారి వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యత వంటి అంశాల్లో యువత శ్రద్ధచూపాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకొనేందుకు ఈ మాక్ పార్లమెంట్ తరహా సమావేశాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సెట్ సిఇఒ ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, నెహ్రూ యువకేంద్రం గణాంకాధికారి శ్రీనివాసరావు, ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, నెహ్రూ యవకేంద్రం సభ్యులు, అసోసియేట్ ప్రొఫెసర్ రాజేష్ పాల్గొన్నారు.


స్థూపావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

13న తరుణచారి స్థూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి- సోంపేట

తొలితరం కమ్యూనిస్టు తరుణాచారి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ స్థూపావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మామిడిపల్లికి చెందిన సిపిఎం నాయకులు కోరారు. తరుణాచారి విజ్ఞాన కేంద్రంలో స్థూపావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 13న కానగల అరుణాచారి వర్ధంతి పురస్కరించుకొని ప్రజాయాత్రతో పాటు స్థూపావిష్కరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. నేటి పోరాటాలకు నాటి కమ్యూనిస్టులు చేసిన రైతాంగ పోరాటాలే స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల సభ్యులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కామ్రేడ్ పాతిని కృష్ణమూర్తి, జుత్తు సింహాచలం, సంగారు లక్ష్మీనారాయణ, పాపారావు, లోకనాథం, సింహాచలం, పాల్గొన్నారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న మురళీ ప్రకాశ్

'ఒపిఎస్'కే ఓటు

కవిటి : కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీ ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలం ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓట్ ఫర్ ఒపిఎస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ప్రభుత్వం తమను మోసం చేసిందని ఆరోపించారు. భవిష్యత్‌లో మళ్లీ మోసపోకుండా పాత పెన్షన్ పథకం కొనసాగిస్తామని తమకు లిఖిత పూర్వక హామీ ఇచ్చి, మేనిఫెస్టోలో దాన్ని పొందుపర్చిన పార్టీకే తమ ఓటని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదరంగంలో సత్తాచాటారు

కవిటి: ఆంధ్రా స్టేట్ 51వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యారమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కవిటి మండల క్రీడాకారులు సత్తాచాటారు. గుంటూరులో సోమవారం రాత్రి జరిగిన తుది పోరులో పురుషుల విభాగంలో కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన బార్ల డిల్లేశ్వరరావు, మహిళల విభాగంలో జగతి గ్రామానికి చెందిన లమ్మత హరిప్రియ ద్వితీయ స్థానం కైవశం చేసుకున్నారు. దీంతో ఏప్రిల్ మొదటి వారంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి క్యారమ్స్ పోటీలకు వీరు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్, ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ పూడి నేతాజీ వీరికి అభినందనలు తెలిపారు.

జర్నలిస్టుల నిరసన

పలాస: పత్రికా విలేకరులను వ్యక్తిగతంగా దూషించడం సరికాదని, ఇటీవల టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష నీలావతి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో పలు పత్రికలను దూషించాడం పత్రిక స్వేచ్ఛకు విరుద్ధమని వామపక్ష నాయకులు, జర్నలిస్టు నాయకులు అన్నారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం కాశీబుగ్గ పోలిస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జర్నలిస్టులకు శిరీష బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పత్రికల్లో వచ్చిన వార్తలు ఇబ్బందికరంగా ఉంటే చట్టపరంగా వెళ్లాలి తప్ప, భౌతిక దాడులకు పాల్పడే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో డి.మహారణ, ప్రింట్ మీడియా అధ్యక్షులు చిక్కోలు జగదీష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సంఘం అధ్యక్షులు సిహెచ్ నేతాజీ, వంకల మాధవరావు, మద్దిల రామారావు, జర్నలిస్ట్‌లు అంది రామకృష్ణ, కింజరాపు కృష్ణ, సిఐటియు నాయకులు గణపతి, కార్మిక సంఘం నాయకులు దుష్యంత్, దున్న శ్రీను పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో 722 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల చెంతకు అందించడం ద్వారా జగన్ పాలనను అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కరరావు, ఆర్ఐ వైకుంఠరావు, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల వైసిపి కన్వీనర్ పల్లి యోగి, కరణం శశిభూషణరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో అభివృద్ధి

గ్రామాల అభివృద్ధి, అక్కడికక్కడే సమస్య పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో సిఎం జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలం మర్రిపాడు (సి) సచివాలయం, ఆర్‌బికె, పెద్ద పద్మాపురం ఆర్‌బికె, ఇలైపురం ఆర్‌బికె, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను మంగళవారం ప్రారంభించారు. అనంతరం గొడ్డ గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి దానకర్ణుడు, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శాంతి

సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్రం అగ్రగామి

మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి -వజ్రపుకొత్తూరు

సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కొండవూరులో గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది చాలా కీలక సమయమన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి మళ్లీ అధికారంలోకి రావలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, సర్పంచ్ కొల్లి భాస్కరరావు, మామిడి బాస్కరరావు, బచ్చల ధర్మారావు, మాజీ ఎంపిటిసిలు ఇరోతు హేమంతరాజు, ఇప్పిలి అప్పన్న, దువ్వాడ ఉమామహేశ్వరరావు, దట్టి నాగేశ్వరరావు, మద్దిల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

జగన్‌తోనే సంక్షేమ పథకాలు

కోటబొమ్మాళి : సిఎం జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సిఎం అయితేనే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలం చీపుర్లపాడు పంచాయతీలో సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపిటిసి బొడ్డు అప్పన్నల అధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గడ్డవలస నాగభూషణరావు, బగాది వివాకర్, పూజారి సత్యం, గొద్దు చిరంజీవి, పంకు రాము, మెట్ట సింహాచలం, కూన దాలప్ప ఉన్నారు.

'సొంతింటి కల నెరవేరుస్తాం'

ప్రజాశక్తి -శ్రీకాకుళం రూరల్

మండలంలోని పాత్రునివలస గ్రామంలో 46 మందికి ఇళ్ల పట్టాలను వైసిపి యువ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మొదటి విడతలో 70 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్‌రావు, శ్రీధర్, బుడ్డి గణేష్, బాణాల గాంధీ, దాలినాయుడు, కంచు వసంత, యాల్ల శ్రీను, బాన్న శ్రీను, అప్పలరాజు, అప్పాయాదవ, ముకుంద, రాము, శ్రీను పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

శ్రీకాకుళం అర్బన్ : చదువుతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఆయన అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్.గోవిందరావు, ఉపాధ్యాయులు రవికుమార్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం మెంటార్ నటుకుల మోహన్, సెక్రెటరీ రాంగోపాల్, ట్రెజరర్ శిల్లా మణి, సభ్యులు కామేష్, లావేటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ నిర్ధారణలో వీడియో కీలకం

శ్రీకాకుళం అర్బన్ : ఎన్నికల వ్యయనిర్ధారణలో వీడియోగ్రఫీ పాత్ర కీలకమని సిపిఒ లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల సమయంలో వీడియో సర్వేలెన్స్ బృందాలకు, వీడియో గ్రాఫర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిసిఒ బాలాజీ నాయక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిపిఒ లక్ష్మీప్రసన్న, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ వెంకట్ రామన్ మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన కల్పించారు. వీడియో గ్రాఫర్లు ఎన్నికలకు జరిగిన వ్యయానికి సందర్భాలను, సంఘటనలను చిత్రీకరణ చేయాలని సూచించారు. పోస్టర్లు, వాహనాలు, కటౌట్లు, బ్యానర్లు, ఫర్నిచర్ తదితర అంశాలను వీడియోలో చిత్రీకరించాలన్నారు. కార్యక్రమం నిర్వహిస్తున్న అభ్యర్థి తదితర అంశాలను వాయిస్ మోడ్ ద్వారా రికార్డు చేయాలని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ వీడియోగ్రఫీ నిర్వహణలో పలు సాంకేతిక వివరాలు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలో వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

7న మండల సమావేశం

ఆమదాలవలస: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 7న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎ.రత్నం ప్రకటనలో తెలిపారు. ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుందని, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. కారక్రమానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరుకావాలని కోరారు.

స్టేషన్‌కు చేరుకున్న ప్రశ్నపత్రాలు

టెక్కలి : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. మంగళవారానికి రెండు సెట్ల ప్రశ్నాపత్రాలకు సంబంధించిన బాక్స్‌లు పోలీస్‌స్టేషన్లో భద్రపర్చారు. పట్టణంలో పలు పాఠశాలలతో పాటు మెళియాపుట్టి మండలం బందపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టు మెంటల్ అధికారుల సమక్షంలో వాటిని భద్రపర్చారు.

సిసి రహదారి నిర్మాణం

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ కళశాల రహదారిలో ఐకాన్ పత్తులు రహదారికి పంచాయతీ నిధులు రూ.2లక్షలతో మంగళవారం సిసి రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ రహదారి నిర్మాణాన్ని సర్పంచ్ పడాల కృష్ణ పరిశీలించారు. ఈ రహదారి నిర్మాణంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో లోతుగెడ్డ జనార్ధన, చోడవరపు గోవిందరావు తదితరులు ఉన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమ పాలన

ప్రజాశక్తి- జి.సిగడాం

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎన్. అచ్చుతరావు అన్నారు. మంగళవారం జి.సిగడాం, నడిమివలస, కొత్తపేట, జాడ, జగన్నాధవలస, పెనసాం తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు రావాలి...జగన్ పోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి కన్నం నాయుడు, గోవింద, పి. దాలి రాజు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: టిడిపి జాతీయ నాయకులు చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో త్వరలో జరగబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం ఖాయమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కూన సంజీవరావు అన్నారు. మంగళవారం మూలసవలాపురం పరిధిలోని తురకపేటలో టిడిపి నాయకులతో కలిసి సూపర్ సిక్స్ శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అవగాహన కల్పించారు.

టెక్కలి: టిడిపితోనే సుపరిపాలన సాధ్యమని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. సూపర్ సిక్స్ పథకం ప్రచారంలో భాగంగా ముఖలింగాపురం పంచాయతీ పరిధి బెండకాయల పేట, చిరుతనాపల్లి, ముఖలింగాపురం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు మెండ దమయంతి, షణ్ముఖరావు, మట్ట పురుషోత్తం, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, కోళ్ల లవకుమార్, కామేష్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అచ్యుతరావు

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధి 13వ వార్డులో పెంటయ్య క్వార్టర్స్, సాయి నగర్ ప్రాంతాల్లో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిటిపి లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, నాయకులు బగాది రమణమూర్తి, గొల్లపల్లి వేణుగోపాలరావు, జొన్నాడ రాము, సీపాన రాంబాబు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం



ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం కలిగించాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు అన్నారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హానికరం లేని కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రకృతి వ్యవసాయానికి అందరూ ప్రోత్సహించాలని, ప్రతి మహిళ పెరటి తోటలు ఏర్పాటు చేసుకుని తద్వారా పండిన కూరగాయలు, ఆకుకూరలు మాత్రమే ఆహార పదార్థాలుగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్ఎఫ్.డిపి ఎం.రేవతి, సిబ్బంది సిహెచ్ సూర్యనారాయణ, 36 గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జి.సిగడాం: ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం చేస్తే అన్నదాతలకు జీవన ప్రమాణాలు, ఆర్థిక భరోసా కలుగుతుందని ఎపిఎం రెడ్డి రామకృష్ణ నాయుడు అన్నారు. మండల మహిళా సమైక్య భవనంలో మంగళవారం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వయం శక్తి సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమైక్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రైతు సాధికార సంస్థ అన్నదాతలకు సాంకేతిక సహకారాన్ని అందిస్తుందని, ఎపి సిఎన్ఎఫ్ అమలు చేసేందుకు మండల సమైక్య ఆర్థిక సహాయాన్నందిస్తుందన్నారు. కార్యక్రమంలో సిఎఫ్‌లు, సిసిలు సిఎన్ఎఫ్ సిబ్బంది సంతోషి, రాజేష్, శివ, రాజేశ్వరమ్మ, విఒ అధ్యక్షులు, ఎమ్మెస్ ఒబిలు పాల్గొన్నారు.

గురువులకు పాదపూజ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి. వైకుంఠరావు అధ్యక్షతన పాతపట్నంకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, గురువులకు పాద పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇఎస్ఎంసి చైర్మన్ జి.ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. విశ్రాంత గ్రేడ్‌వన్ తెలుగు పండితులు బందన శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డి.ఎ.స్టాలిన్ పరీక్షలు రాసే విధానం, మెళకువలపై విద్యార్థులకు వివరించారు. ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు 10వ తరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లు వితరణగా అందించారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు వి. సూర్యప్రకాష్, ఎం.శైలజ, సుభాషిణి, హెచ్.అనురాధ, పి.నాగేశ్వరరావు, ఎల్.శ్రీనివాసరావు, ఇందుమతి, నీలకంఠేశ్వరరావు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


గురువులకు పూజలు చేస్తున్న విద్యార్థులు

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్నికలు ప్రశాంత నిర్వహణకు అన్ని వర్గాలకు చెందిన వ్యక్తులు సహకరించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.దివాకర్ వాయునందన్ యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ప్రధాన రహదారిపై పట్టణ పోలీసులు, రైల్వే పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ప్రజలకు పలు సూచనలు చేశారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు వేసుకునే విధంగా పోలీసులు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, పలు రంగాలకు చెందిన వ్యక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్, ఆర్ఎఫ్ ఎస్ఐ దీపక్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

లావేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. మంగళవారం ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎం.సునీత సమావేశం ఎజెండాను సభలో చదివి వినిపించారు. అనంతరం మొక్కిబడిగా రెండు శాఖలకు సంబంధించిన అధికారులు తమశాఖ పరిధిలో ఇంతవరకు జరిగిన పనులను వివరించారు. గుమ్మాడం సర్పించ్ దుర్గశి ధర్మారావు మాట్లాడుతూ పంచాయతీల్లో చేస్తున్న పనులకు గాను మెటీరియల్ సంబంధించి కొనుగోలు చేసినప్పుడు జిఎస్‌టి చెల్లిస్తున్నామని, బిల్లు చెల్లింపులు మంజూరు సమయంలో రెండోసారి జిఎస్‌టి రూపంలో కట్ చేస్తున్నారన్నారు. ఇలా అయితే తాము తీవ్రంగా నష్టపోతున్నామని అధికారులను ప్రశ్నించారు దీనిపై ఉన్నతాధి కారుల దృష్టిలో పెడతామని మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ అన్నారు. గుర్రాలపాళెం సర్పించ్ షేక్ బాషా, ఎంపిటిసి జె.బానోజీరా వులు తమ గ్రామంలో జలజీవన్ పనులు మంజూరు చెయ్యలేదని, మడ్డువలస కాలువలపై ఐదు ఏళ్లుగా ప్రతీ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎస్.కొండలరావు, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, ఇఒపి ఆర్‌డి ప్రభాకరరావు, కార్యాలయ సీనియర్ సహాయకులు మాధవరావు, పిడిపిఒ ఝాన్సీరాణి పాల్గొన్నారు.



ఎజెండాను చదివి వినిపిస్తున్న సూపరింటెండెంట్ సునీత

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే సైన్స్ ప్రదర్శనలు



విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న గంగా భవాని

ప్రజాశక్తి- పలాస

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు సైన్సు ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగ పడుతుందని మథర్ థెరిస్సా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగాభవానీ అన్నారు. మంగళవారం పాఠశాలలో ఇటీవల నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టు విజేతలకు బహుమతులను అందించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పోటీ పరీక్షల్లో విరివిగా పాల్గొని తమ ప్రతిభను చూపాలన్నారు. చిన్న వయసు నుంచే ప్రాజెక్టులు తయారీ చేయడం, వాటిని వివరించడంపై దృష్టిసారించాలన్నారు. భవిష్యత్‌లో ఇప్పుడు చేసిన ప్రాజెక్టులు, ప్రతిభలు ఉన్నత చదువులకు ఉపయోగ పడుతుంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ఆర్.ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, చిరంజీవి, శశిరేఖలు పాల్గొన్నారు.




సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం లచ్చన్నపేట జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ మేరకు టెక్కలి సిఐ పైడయ్య తెలిపిన వివరాల ప్రకారం పలాస వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న నందిగాం అప్పారావు (42) తీవ్ర గాయాలతో మృతి చెందగా, ముందు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా యువకుడికి గాయాలయ్యాయని తెలిపారు.

తోపులాటలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-ఎచ్చెర్ల

తోపులాటలో కిందపడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని కుప్పిలిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కుప్పిలిలో బైక్ పార్కింగ్ విషయంలో సోమవారం యువకులు రాకేష్, ఉమారెడ్డి గొడవపడ్డారు. మళ్లీ మంగళవారం ఉదయం బైక్ ఎందుకు తొలగించలేదని రాకేష్‌ను ఉమారెడ్డి తల్లి హరిలక్ష్మి నిలదీయగా, మళ్లీ వీరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు చేరుకొని వివాదం సద్దుమణిగించే ప్రయత్నం చేశారు. రాకేష్ తాత కిల్ల అప్పలస్వామి (65) మనవడిని మందలించే ప్రయత్నం చేశాడు. ఈ సందర్భంగా తోపులాటలో అప్పలస్వామి కిందపడటంతో అపస్మారక స్థితికి చేరుకొని, అనంతరం ప్రాణాలు విడిచాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఉమారెడ్డి, హరిలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఎచ్చెర్ల

మండలంలోని కుప్పిలి గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కుప్పిలి గ్రామానికి చెందిన నిమ్మ నచ్చుడు (35) ఇంట్లో స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతుండగా షాక్‌కు గురయ్యాడు. అపస్మాకర స్థితిలో పడి ఉన్న ఆయన్ను ఆటోలో తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

అరసవల్లిని సందర్శించిన అదనపు డిజి

ప్రజాశక్తి -శ్రీకాకుళం అర్బన్

అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని మంగళవారం హైదరాబాద్ రీజియన్‌కు చెందిన సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అదనపు డిజి సిసిర్ బన్సల్ సతీసమేతంగా సందర్శించారు. వారిని ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్నారు. అనంతరం అనివేటి మండపంలో వారికి ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు జ్ఞాపికను అందజేశారు.

సిఎంను కలిసిన ఎమ్మెల్యే శాంతి

ప్రజాశక్తి -పాతపట్నం


సిఎం జగన్‌తో ఎమ్మెల్యే

విశాఖ పట్నం పర్యటనకు మంగళవారం వచ్చిన సిఎం జగన్‌ను పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మర్యాదపూర్వకంగా వెళ్లి కలిశారు. ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపగడపకు వెళ్లి తెలియజేస్తున్నామని, మంచి స్పందన లభిస్తోందని రెడ్డి శాంతి.. సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా ఆమెకు సిఎం పలు సూచనలు చేశారు.

నీటి ఎద్దడి నివారణే లక్ష్యం

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీటి సమస్య నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. 19వ వార్డులో నూతంగా ఏర్పాటు చేసిన పవర్ బోరును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇప్పటికే ఐదు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శిస్టు బృందావతి, వైసిపి నాయకులు శిష్టు గోపి, బడగల బల్లయ్య, దున్న సత్యం, బగాది సింహాచలం, సీపాన శ్రీరాములు, దుమ్ము రాజు, లోకేష్, సనపల కృష్ణ, కె.కృష్ణ, సుధాకర్, భాస్కరరావులు పాల్గొన్నారు.

స్టేషన్ మాస్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జెసిఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సెల్యూట్ ది సైలెంట్ స్టార్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న స్టేషన్ మేనేజర్ కె.సాహు, బుకింగ్ సూపరింటెండెంట్‌లు ఎ.రమణ, డిఎస్ఎన్.మూర్తిలకు జెసిఐ ప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెసిఐ అధ్యక్షులు షణ్ముఖరావు మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో 4న పలాస, విశాఖపట్నం పాసింజర్ పొడిగించి ఇచ్ఛాపురం నుంచి ప్రారంభం కావడంతో రైల్వే అధికారులను అభినందించారు. కార్యక్రమంలో నవీన్ కుమార్, స్వరూప్ కుమార్, ఢిల్లేసు, జయదేవ్, పవన్ కుమార్, గౌరి శంకర్ పాల్గొన్నారు.

పేద మహిళకు ఆర్థిక సాయం

లావేరు : మండల కేంద్రానికి చెందిన పేద మహిళ వులపల్లి పైడమ్మకు ఇటీవల పలుమార్లు చెయ్యి విరిగిపోవడంతో ఆస్పత్రి ఖర్చులు అధికమై జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో విషయం తెలుసుకున్న హృదయలు ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం ఆమె నివాసానికి వెళ్లి ఫౌండేషన్ తరుపున తక్షణసాయంగా రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో ఎటువంటి సహాయం కావాలన్నా ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామని తెలిపారు. పైడమ్మతో పాటు గ్రామస్తులు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు అప్పలరాజు, ఎన్.వి.రమణ, కొరడా వాసుదేవరావు, బిక్కువోలు అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.